# ఉరిశిక్షల రద్దుకోసం ఆందోళన చేద్దాం రండి!



ఉరికంబం మనిషిని చంపే యంత్రం మాత్రమే కాదు. భయోత్పాతానికీ, క్రూరత్వానికీ, జీవితాన్ని అవమానపర్చడానికీ అది ప్రతీక. ఆదిమ రాక్షసత్వానికి, మధ్యయుగ మౌఢ్యానికీ, ఆధునిక నిరంకుశత్వానికీ సామాన్య లక్షణం.

- ఆర్థర్ కోస్లర్.

హంతకుడంటే మనిషి + హత్య. హత్యను శిక్షించి మనిషిని మిగిలిస్తే నిజమైన న్యాయం జరుగుతుంది.

- జస్టిస్ వి.ఆర్. కృష్ణయ్యర్.

ప్రజలారా!

చిలకలూరిపేట బస్సు దహనం కేసులో ఉరిశిక్ష పడిన చలపతిరావు, విజయవర్ధనరావులకు ఉరి తప్పించడానికి జరుగుతున్న ప్రయత్నం పట్ల చాలామంది తీవ్ర వ్యతిరేకత తెలుపుతున్నారు.

ఆ వ్యతిరేకతకు జవాబు చెప్పడం కోసం ఈసభ జరుపుతున్నాం.

నిర్దయగా హత్య చేసిన వాళ్లను నిర్దయగా ఉరితీస్తే తప్పేముంది? అని చాలామంది అడుగుతున్నారు. వాళ్లు చూపించని దయ వాళ్లకు ఎందుకు చూపించాలి అని అడుగుతున్నారు.

వాళ్లసలు నిర్దయగా హత్య చేయలేదు. వాళ్లు హంతకులు కారు. హత్యలు చేసి శవాలను దోచుకొనే బాపతు కాదు. (అటువంటి వాళ్లు మన రాజకీయ నాయకులలో కనిపిస్తారు).

అసలు ఈ యిద్దరూ గతంలో ఏరోజూ పోలీస్ స్టేషన్ గడప తొక్కిన వారు కారు. చిన్న జేబు దొంగతనం సహితం చేయలేదు.

మరివాళ్లు ఏం చేసేవారు? ఒకతను పెయింటర్‌గా పని చేసేవాడు. ఒకతను భవనాల నిర్మాణంలో రాడ్‌బెండర్‌గా పనిచేసేవాడు. ఇద్దరూ దళితులు. కాయకష్టం చేసినా పూటగడవని పేదలు. తల్లిదండ్రులను, భార్యను ఎట్లా పోషించాలో తెలియక వేదన అనుభవించిన దౌర్భాగ్యులు. ఆ బాధలనుండి గట్టెక్కడానికే వాళ్లు దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారు.

దొంగతనం ఎట్లా చేయాలో కూడ వాళ్లకు తెలీదు. చేసి ఎట్లా తప్పించుకోవాలో తెలీదు. ఎప్పుడయినా చేసిఉంటే కదా తెలియడానికి?

ఎక్కడో పేపర్‌లో చదివారంట ఒక వార్త. అదొక బస్సుదోపిడీ వార్త. కొందరు యువకులు పెట్రోల్ డబ్బా చేతపట్టుకొని బస్సెక్కి బస్సు తగలబెడతామని బెదిరించి బస్సు దోచుకున్న వార్త. తాము ఆపనే చేద్దామనుకున్నారు.

కానీ బస్సులోని ప్రయాణికులు తాము ఊహించిన దానికంటే భిన్నంగా స్పందించేసరికి అనుభవం లేని ఈఇద్దరు కొత్త దొంగలు గాభరాపడ్డారు. బస్సు ప్రయాణికులు ఎంత భయపడ్డారో వీళ్లూ అంత భయపడ్డారు. బస్సు నుండి క్రిందికి దిగడానికి అందరూ తొందర పడ్డారు. అప్పటికే పెట్రోల్‌తో తడిసిన బస్సు నేలభాగం ఈహడావుడిలో అంటుకొనింది.

ఆకలితో చేసిన ఈ అసంకల్పితమైన నేరానికి వాళ్లకు ఎంత శిక్ష వేయాలి? మన రాజకీయ నాయకులలాగ, ప్రభుత్వ అధికార్లలాగ, నల్లబజారు వ్యాపారస్తులలాగ వీళ్లు ధనదాహంతో నేరం చేయలేదు. బ్రతుకు గడవక నేరం చేసారు. కాయకష్టం చేసుకునే ఈ దళిత యువకులకు అంతకంటే వేరే మార్గం కనిపించలేదు. వాళ్లకు అంతకంటే వేరే మార్గం ఈ సమాజం చూపించలేదు.

అయినప్పటికీ వాళ్ల దుందుడుకు ప్రయత్నంవల్ల 23 ప్రాణాలు పోయాయి. 23 మంది అమాయక ప్రయాణికులు ఒక్క నిముషంలో అసువులు బాసారు. వీళ్ల పేదరికానికీ, వీళ్ల కష్టాలకూ ఆ 23 మంది ఏరకంగానూ బాధ్యులు కారు. కాబట్టి ఈ ఇద్దరినీ శిక్షించవలసిందే.

కానీ ఎంత శిక్ష వేయాలి? మరణదండన విధించవలసిందేనా? 17 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ జైళ్లలో ఎవరినీ ఉరి తీయలేదు. ఉద్దేశ్యపూర్వకంగా, క్రూరంగా చేసిన ఎన్నో హత్యలు ఈ 17 ఏళ్లలో జరిగాయి. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రులను మార్చడానికి మారణహోమం జరిగింది. రాయలసీమలో ప్లానువేసి దారికాచి హతమార్చిన సంఘటనలెన్నో జరిగాయి. 17 ఏళ్లలో దాదాపు 40 వేల హత్యలు జరిగి ఉంటాయి. వీటిలో ఏ ఒక్కదానికీ ఎవ్వరినీ ఉరి తీయలేదు. చట్టానికి దొరకనివాళ్ల

సంగతి పోనీయండి. దొరికిన వాళ్లకు సహితం జీవిత ఖైదు చాలని కోర్టులు భావించాయి.

మరి చలపతిరావు, విజయవర్ధనరావులు ఉద్దేశ్యపూర్వకంగా చంపలేదు. ప్లానువేసి చంపలేదు. వాళ్ల ఆత్రుతతో చేసిన ఘోరమైన పొరబాటువల్ల 23 మంది చచ్చిపోయారని చెప్పి వాళ్లకు ఉరిశిక్షే తగిన శిక్ష అందామా? వాళ్లకు కూడా జీవిత ఖైదు ఉచిత శిక్ష అనుకోలేమా? అర్భకులూ, దళితులూ అయిన ఈ యిద్దరి తరపున మాట్లాడేవారెవరూ లేరని చెప్పి మన న్యాయ వ్యవస్థ తన పరాక్రమాన్నంతా వీరిపైనే చూపించాలా?

అక్కరలేదని మేము అనుకుంటున్నాము. వాళ్లకు వేసిన మరణ దండనను జీవిత ఖైదుగా మార్చడమే న్యాయం అనుకుంటున్నాము.

వీరిద్దరిగురించే కాక అసలు 'మరణ దండన' అనే శిక్ష గురించి కూడా ప్రజలు ఆలోచించాలని మేము కోరుకుంటున్నాము. నువ్వు చంపావు కాబట్టి నువ్వు చావవలసిందే అనే న్యాయవ్యవస్థ ఒక నాగరికమైన వ్యవస్థేనా? నేరానికి సమాజం బాధ్యత కొంత ఉందని గుర్తించకుండా వ్యక్తిపైననే బాధ్యత అంతా పెట్టడం సబబేనా? పౌరులు ప్రతీకారం తీర్చుకుంటే ఒప్పుకోని చట్టం న్యాయం పేరిట ప్రతీకార నీతిని ఆచరించడం సబబేనా? నేరం చేసినవారిపైన సమాజం ప్రతీకారం తీర్చుకునే ఈ శిక్షాస్మృతి బదులు నేరం చేసిన వ్యక్తినీ, ఆ వ్యక్తికి స్థానం కల్పించిన సమాజాన్నీ సంస్కరించే వ్యవస్థను రూపొందించలేమా? ప్రపంచంలో మరణ దండనను రద్దుచేసిన దేశాలు 55 ఉన్నాయి. వాటి జాబితాలో మనమూ చేరలేమా?

ఈ విషయాలన్నీ ఆలోచిద్దాం రండి.

## బహిరంగ సభ

20-12-96 శుక్రవారం సాయంత్రం 5.00 గం.లకు

లయన్స్ క్లబ్ హాల్, రామ్‌నగర్, విశాఖపట్నం

అధ్యక్షత : కె.జి. సత్యమూర్తి (జాతీయ అధ్యక్షులు, బహుజన రిపబ్లికన్ పార్టీ)

వక్తలు : బి. చంద్రశేఖర్ (ఎ.పి.సి.ఎల్.సి. గుంటూరు జిల్లా కార్యదర్శి)

కె. సజయ (అన్వేషి)

కె. బాలగోపాల్ (ఎ.పి.సి.ఎల్.సి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

15-12-96
విశాఖపట్నం

**చలపతి, విజయవర్ధనరావుల ఉరిశిక్ష రద్దు కమిటీ**

---

శిక్ష వేసినప్పటినుంచి అది అమలుపరచేవరకూ ఖైదీ కంటిముందు మృత్యువు మెదులుతుంటే కండెమ్డ్ సెల్స్‌లో ఉంటూ ఒంటరిగా భరించే మానసిక క్షోభతో ఎంతగానో కృశించిపోతాడు. ఆ బాధలో ఆత్మహత్య చేసుకోవడానికీ ప్రయత్నిస్తారు... వాళ్ళంతకు ముందు నేరాన్ని చేశారో లేదో తర్వాత విషయంగానీ జైలులో మా ముందుకు వచ్చినప్పటినుంచి కృంగిపోతూ క్షమాభిక్ష కోసం ఎదురుచూస్తూ దీనంగా కనిపిస్తుంటారు. అటువంటివాళ్లని నిర్దాక్షిణ్యంగా ఉరితీయడానికి మాకూ ఎంతగానో బాధగా ఉంటుంది... ఉరితీత తర్వాత రెండు మూడు రోజులు కండెమ్డ్ సెల్స్‌వేపు కూడా వెళ్ళేవాణ్ణి కాను. అక్కడ అతను నిల్చుని 'సార్ నాకు క్షమాభిక్ష దొరికిందా?' అని కన్నీళ్ళతో పదేపదే అడుగుతున్నట్లనిపించేది...

\- ఖురుదుకర్,

(సికింద్రాబాద్‌లో జైలు సూపరింటెండెంట్‌గా పనిచేసి ఎనిమిది ఉరిశిక్షలను అమలుపరచిన అధికారి)

ఆఖరి ఘడియల్లో వారిని చూస్తున్నప్పుడు నాకు అర్థమయ్యేది నేను చేస్తున్న పనివల్ల ఒక్కటంటే ఒక్క హత్య కూడా ఆగలేదని.

\- ఆల్బర్ట్ పియిర్‌పాయింట్.

(బ్రిటన్‌లో పాతికేళ్లపాటు నిపుణుడైన తలారిగా అనేకమందిని ఉరితీసిన వ్యక్తి)